క్లుప్తంగా

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. గురువారం గాజులపెళ్లూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు ప్రభుత్వం నెలకు సరిపడా మందులు ఉచితంగా ఇస్తుందని, ప్రైవేటు మందులు కొని పోస్టల్ ద్వారా వారి ఇంటికి పంపిస్తారన్నారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీహెచ్ఓ వేంకటేష్ పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు, పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

చెరువులో పూడికతీత పనులు



పూడికతీత పనులను చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి పథకంలో గాజులపెళ్లూరు గ్రామంలోని కొత్తచెరువులో పూడికతీత, కట్టకు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. 150 మంది కూలీలు చెరువులో పూడికతీత పనుల్లో నిమగ్నమై మట్టిని తీసి కట్టపై పోసి మరమ్మతులు చేస్తున్నారు. చెరువు పూడికతీత, కట్టకు మరమ్మతులకు ఉపాధిలో రూ.5 లక్షలు మంజూరైందని ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణయ్య తెలిపారు. కూలీలకు రోజుకు రూ.250 కూలి గిట్టుబాటు అవుతుందని, 10 రోజులపాటు పనులు జరుగుతాయన్నారు.

ఆపస్ నూతన కార్యవర్గం ఏర్పాటు



ఆపస్ నూతన కార్యవర్గ సభ్యులు

నారాయణవనం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నారాయణవనం మండల శాఖ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్య నిర్వాహకవర్గ సమావేశంలో మండల అధ్యక్షుడిగా షణ్ముఖమొదలి, ప్రధాన కార్యదర్శిగా రాజేంద్రన్‌ను ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, మహిళా కార్యదర్శిగా భువనేశ్వరి, కోశాధికారిగా బాలాజీ, మండల ఉపాధ్యక్షురాలుగా వనజ, కన్వీనర్లుగా జ్యోతి, రమేష్, క్రీడా కన్వీనర్‌గా రాజా, కార్యవర్గ సభ్యులుగా దేవీలక్ష్మి, విజయలక్ష్మి, చెంచమ్మ, హేమావతి, ఇందుమతి, గిరి ఎన్నికయ్యారు. కార్యవర్గం ఎన్నిక జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగరాజు దొరస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు తేజోమూర్తి, జిల్లా కౌన్సిల్ కన్వీనర్ ధనంజయలు సమక్షంలో కార్యవర్గం ఎన్నిక జరిగింది.

రూ1.8 లక్షల నెయ్యి వితరణ



నెయ్యి డబ్బాలను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీస్వామి, అమ్మవార్లకు రోజూ జరిగే నిత్య నైవేద్యం, దీపారాధనకు భక్తులు గురువారం నెయ్యి వితరణగా అందించారు. పుత్తూరుకు చెందిన శ్రీరంగం మిల్క్ ప్రొడక్ట్స్ తరఫున రూ.1,81,876 విలువ చేసే 432 కిలోల నెయ్యిని సంస్థ ప్రతినిధులు నిత్యాన్నదానం ఇన్‌చార్జ్ ఏఈఓ ప్రసాద్, సూపరింటెండెంట్ కల్యాణికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం వద్ద అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు గురువారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పాతవీరాపురం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో వాహనంలో 11 మద్యం బాటిళ్లు ఉన్నట్టు గుర్తించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, పాతవీరాపురానికి చెందిన పాతగుంట గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

నేను మీ వాడిని..ఆశీర్వదించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఆదర్శ శ్రీకాళహస్తిగా తీర్చిదిద్దుతా
- రేపటి నామినేషన్‌కు తరలిరండి
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తాను ప్రజల మనిషినని, ఐదేళ్లు అందరికీ అందుబాటు ఉంటూ సేవలు అందించానని, మరోసారి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని బియ్యపు మధుసూదన్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, అభిమానుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యనే తాను గెలిచినట్లుగా ఉందన్నారు. గత ఎన్నికల్లో తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రజలకు ఐదేళ్లుగా తాను నిత్యం అందుబాటులో ఉన్నాన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేశానని తెలిపారు. 30 సంవత్సరాల బొజ్జల కుటుంబ పాలనలో జరగని అభివృద్ధిని నాలుగున్నరేళ్లలో చేసి చూపించినట్లు పేర్కొన్నారు. తాజాగా శ్రీకాళహస్తిలో ఇతర పార్టీల నాయకులంతా ఏకమయ్యారన్నారు. అయినా తన నుంచి ఎవరూ ఒక్కరూ కూడా విడిచి వెళ్లలేదన్నారు. 2024లో గెలిచిన తరువాత ఏ ఒక్కరికీ తాను కండువా కప్పనని మాట ఇస్తున్నట్లు తెలిపారు.

నామినేషన్‌కు తరలిరండి

ఈనెల 20వ తేదీ తాను నామినేషన్ దాఖలు చేయనున్నట్లు బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆరోజు ఉదయం 9గంటలకు శ్రీరామ నగర్‌కాలనీలో ఉన్న శ్రీవిజయగణపతి ఆలయం నుంచి ర్యాలీగా బయలుదేరుతుందని పేర్కొన్నారు. రామసేతు వంతెన మీదుగా బియ్యపు కృష్ణారెడ్డి మండపం, పెండ్లిమండపం, భేరివారి మండపం, గాలిగోపురం, జలవినాయకస్వామి ఆలయం నుంచి వంతెన మీదుగా పొన్నాలమ్మ గుడివరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజల, అభిమానులు తరలివచ్చి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు అంజూరు తారక శ్రీనివాసులు, మిద్దెల హరి, గుమ్మడి బాలకృష్ణయ్య, బర్రి హేమభూషణ్‌రెడ్డి, ఉన్నం వాసునాయుడు, కూనాటి రమణయ్యయాదవ్, వయ్యాల కృష్ణారెడ్డి, లోకేష్‌యాదవ్, పగడాల రాజు, జయగోపాల్, కంఠా ఉదయ్‌కుమార్, శివకుమార్‌యాదవ్, చందమామల కోటయ్య, చంద్రయ్యనాయుడు, పసల సుమతి, సాగీరాబి, షర్మిలా ఠాగూర్, ప్రమీలమ్మ, ధనలక్ష్మి, శారద, చింతామణి పాండు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవాలి



రాజేష్‌ను సత్కరించి మద్దతు తెలుపుతున్న చేనేత సంఘం నేతలు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: చేనేత కుటుంబాలకు నేతన్న నేస్తం ద్వారా ఆర్థిక భరోసా కల్పించిన జగనన్న ప్రభుత్వానికి అండగా నిలిచి, గత టీడీపీ ప్రభుత్వంలో చేనేత వ్యవస్థను నీరుగార్చిన చంద్రబాబుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు రూపంలో బుద్ధి చెప్పాలని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి కంచరపాళెంలో రాజేష్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. స్థానిక పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలతో మమేకమై ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న దేవాంగ చేనేత కుటుంబాల వారు చేనేత చిహ్నం చెరఖా (రాట్నం) ముందుంచి రాజేష్‌కు చిలపనూలుతో మాలవేసి తలపాగాతో ఘనంగా సత్కరించారు. మేమంతా జగనన్నకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఐదేళ్ల జగనన్న ప్రభుత్వంలో ఐదు విడతలుగా నేతన్న నేస్తం ఏడాదికి రూ. 24వేలు చొప్పున మేము అందుకున్నామని, చేనేతలను ఇంతగా ఆదరించిన ప్రభుత్వం దేశంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని వారు తెలిపారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కంచరపాళెం దళితవాడలో రాజేష్‌ను గజమాలతో సత్కరించి ఆశీర్వదించారు. మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, స్థానిక ఉపసర్పంచ్ తులసి, చేనేత నేతలు మాచర్ల శేఖరయ్య, పృథ్వీ రవి, పీవీ రమేష్, చంద్రశేఖర్, సుబ్రమణ్యం, శివయ్య, గిరిజ, పార్వతి, సులోచనమ్మ పాల్గొన్నారు.

సీనియర్ నేతకు పరామర్శ:

కంచరపాళెంకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బందిల బాలయ్యను ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ పరామర్శించారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా, కంచరపాళెంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో బాలయ్య ఇంటి వద్దకు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు.



నూకతోటి రాజేష్‌ను సత్కరిస్తున్న కంచరపాళెం గ్రామస్తులు



బాలయ్యను పరామర్శిస్తున్న రాజేష్

సత్యవేడులో రెండు నామినేషన్ల దాఖలు

సత్యవేడు: నామినేషన్ల ప్రక్రియలో తొలిరోజు అసెంబ్లీ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ ఆఫీసర్ నరసింహులు తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేకంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయ గదిని ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న నూకతోటి రాజేష్ నామినేషన్‌ను సత్యవేడుకు చెందిన సర్పంచ్ మంజుల ప్రతిపాదించారు. ఆమెతోపాటు రాజేష్ భార్య ఎన్. చైతన్యభాను, బి.భానుప్రకాష్‌రెడ్డి, పవన్, రాజశేఖర్ కలిసి ధ్రువీకరణపత్రాలను ఆర్ఓ నరసింహులు, సహాయ అధికారి రామాంజనేయులకు అందజేశారు. అదేవిధంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బాలగురవం బాబు నామినేషన్ దాఖలు చేశారు.

శ్రీకాళహస్తిలో 3 నామినేషన్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం నామినేషన్ వేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డికి అందజేశారు. సుధీర్‌రెడ్డి తరఫున భార్య రిషితారెడ్డి ఒక సెట్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కె.దయానంద్‌బాబు నామినేషన్లు వేశారు. గురువారం మొత్తం 3 నామినేషన్లు దాఖలయ్యాయి.

నేడు నూకతోటి రాజేష్ ప్రచారం

నాగలాపురం: మండలంలో సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు అపరంజిరాజు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బైటకొడియంబేడు, నందనం, సుబ్బనాయుడుకండ్రిగ పంచాయతీలలో ప్రతి గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు, కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు కలిసి జయప్రదం చేయా లని ఆయన కోరారు.

సొసైటీ కార్యాలయానికి విద్యుత్ కట్

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి కార్యాలయ సిబ్బంది రెండు నెలలుగా విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు. దీంతో కార్యాలయంలో లైట్లు, ఫ్యాన్లు, కంప్యూటర్లు పనిచేయకపోవడంతో సిబ్బంది నానా అవస్థలు పడ్డారు. కార్యాలయానికి రుణాల కోసం వచ్చే రైతులు సైతం ఇబ్బంది పడ్డారు. సకాలంలో రైతులు రుణాలు చెల్లించకుంటే ఇబ్బంది పెట్టే సొసైటీ సిబ్బంది విద్యుత్ బిల్లు చెల్లించకపోవడం దారుణమంటున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ బిల్లు చెల్లించలేదని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ బిల్లు చెల్లించి, విద్యుత్ కనెక్షన్ తీసుకుని, కార్యాలయంలో పనులు జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబసభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి నంద్యాలకు చెందిన మారం వెంకటసుబ్బయ్య రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం కుటుంబసభ్యులతో విచ్చేసిన ఆయన దేవస్థానం అధికారులను కలిసి మనవడు అవ్యక్తుత్ శాస్త్రి పేరున ఈ సొమ్మును అందజేశారు. వారికి అధికారులు కృతజ్ఞతలు తెలిపి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం



కొత్తవీరాపురం ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి, పవిత్రారెడ్డి



హారతులతో స్వాగతం

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమైందని, ఈ పాలన ఇలాగే కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొత్తవీరాపురం, అరుంధతీవాడ, వడ్డిపాలెం, ఎస్సీకాలనీలో ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. పార్టీలు, కుల మత, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ జగనన్న సంక్షేమ పథకాలను అందజేశారని తెలిపారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా తమ పార్టీ నేతలకు దోచిపెట్టేలా చంద్రబాబు దుర్మార్గపు పాలన సాగించారని, అందుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. చంద్రబాబు బూటకపు హామీలతో మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నారని, ఆ మాటలు నమ్మొద్దని కోరారు. రానున్న ఎన్నికల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్ నొక్కి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమణయ్యయాదవ్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ నాయకులు ప్రభు, మురగయ్య, నరేష్, లోకనాథరెడ్డి, మునిరెడ్డి, రామయ్య ఆచారి, చిన్నా, నరేష్, సురేష్, కేశవులురెడ్డి, గాలి గుణశేఖర్ నాయుడు, రాజేంద్ర, చెంగల్‌రాయులు, కరీముల్లా, జీపీ యాదవ్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం ఆయన ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు అభివృద్ధి పనులు పూర్తిచేయనున్నట్టు చెప్పారు. రూ.3కోట్లతో ప్లాట్‌ఫాం, దానిపై మండపం పనులను కాంట్రాక్టర్ వేగవంతంగా చేస్తున్నారని పేర్కొన్నారు.

టీడీపీ వ్యాఖ్యలకు నిరసనగా రాజీనామా



పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

ఏర్పేడు: టీడీపీ అండ్ కో చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని జంగాలపల్లె సచివాలయ పరిధిలో నలుగురు వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. కవిత, రుషిత, గురవయ్య, గురున్నాథం స్వచ్ఛందంగా తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి లవకుమార్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వలంటీర్ల సేవలపై టీడీపీ, జనసేన నాయకుల అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగనన్న విజయం కోసం శక్తి వంచనలేకుండా పనిచేస్తామన్నారు. జగనన్నను మళ్లీ సీఎంగా, ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డిని గెలిపించుకుంటామని చెప్పారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



సత్యవేడు: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రాజయ్య

శ్రీకాళహస్తి: అగ్నిప్రమాదాల నివారణపై గురువారం పట్టణంలోని ది స్కూల్ ఆవరణలో విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ వల్ల తలెత్తే అగ్ని ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్ మూలాన వచ్చే మంటలు..ఇత్యాది వాటిని ఎలా ఆర్పాలి? ఆ మంటల నుంచి సురక్షితంగా ఎలా తప్పించుకోవాలో ప్రదర్శన పూర్వకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జనార్దన్‌రావు పవార్, ప్రధానోపాధ్యాయురాలు విశాల, విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని సత్యవేడు అగ్నిమాపక శాఖ అధికారి పి.రాజయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అగ్నిమాపక సిబ్బంది పంచాయతీలోని పెంట్రోల్ బంకు, గ్యాస్ గోడౌన్ వద్ద ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎల్ఎఫ్‌లు పిచ్చాండి, ప్రసాద్, డీఓపీలు జి.సుబ్రమణ్యం, గోవిందరాజులు, ఫైర్‌మన్‌లు నరేష్, రవికుమార్, చంద్రన్ పాల్గొన్నారు.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి

నారాయణవనం: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని నారాయణవనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాగసుధ పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం నైనారుకండ్రిగ, కీళగరంలలో వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు, గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా విద్యార్థులు సరస్వతీదేవి పూజ నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి కలంకారీకి జాతీయ గుర్తింపు



తలిశెట్టి మోహన్ వస్త్రంపై గీసిన అష్టలక్ష్మీ యంత్రం కళాఖండం



తలిశెట్టి మోహన్

శ్రీకాళహస్తి :శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు వస్త్రాలపై గీస్తున్న కళాఖండాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూనే ఉన్నాయి. తాజాగా పట్టణంలోని బహదూర్‌పేటకు చెందిన కళాకారుడు తలిశెట్టి మోహన్ నాలుగు అడుగుల వస్త్రంపై సహజసిద్ధమైన రంగులతో గీసిన అష్టలక్ష్మీ యంత్రం చిత్రం జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించింది. ఈ యంత్రంలో అష్టలక్ష్మీ వైభవంతోపాటు దశావతారాలు, నవరాత్రుల్లో దుర్గామాత అవతారాలు, శ్రీ–కాళ–హస్తి మహత్యం, నవగ్రహాలు, భక్తకన్నప్ప, శ్రీకాళహస్తి ఏడుగంగల జాతర వైభవం, అష్ట దిక్పాలకులు వంటి చిత్రాలను ఇందులో పొందుపరిచారు. కళాకారుడు తలిశెట్టి మోహన్ గీచిన ఈ కళాఖండం స్వదేశ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపికైనట్లు సమాచారం అందింది. త్వరలోనే ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం





గ్రామోత్సవంలో సీతారాముల ఉత్సవమూర్తులు, హాజరైన మహిళలు

వరదయ్యపాళెం: పెద్ద పాండూరులో వెలసిన సీతా సమేత కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. బుధవారం రాత్రి 10 గంటలపైన కోదండ రామస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్ని కల్యాణాన్ని తిలకించారు. టీటీడీ భజన మందిరం వద్ద ఏర్పాటుచేసిన కల్యాణ వేదికపై వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఆర్అండ్‌బీ రిటైర్డ్ ఇంజినీర్ పరంధామ్‌రెడ్డి కుటుంబసభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేశారు.

వైభవంగా శ్రీరాముని పట్టాభిషేకం..

గురువారం నవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీరాముని పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని పుష్పపల్లకీలో పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారు భక్తులను కటాక్షించారు.